క్లుప్తంగా

వాడ్రాపల్లిలో వినాయకుడికి మకరతోరణం



వినాయకునికి మకరతోరణం సమర్పించిన తాతారావు కుటుంబ సభ్యులు

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లి పెదరామస్వామి ఆలయంలో వెలసిన విఘ్నేశ్వర స్వామి వారికి పెతకంశెట్టి తాతారావు కుటుంబ సభ్యులు రూ.10 వేల విలువ చేసే మకరతోరణం సమర్పించారు. సోమవారం ఉదయం నుంచి వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దలు పెతకంశెట్టి రామజోగినాయుడు, కొయిలాడ దశావతారం, డాక్టర్ పెతకంశెట్టి తరణి, మళ్ల శేషు, మళ్ల అప్పలనాయుడు, మళ్ల పెదనాయుడు, కొణతాల రామకృష్ణ, మళ్ల జగది, పెతకంశెట్టి లీలా భాస్కరరావు, మళ్ల కన్నుంనాయుడు, కాండ్రేగుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గోమాలమ్మ తల్లి సంఘం అధ్యక్షునిగా శ్రీనివాసరావు



నూతన కార్యవర్గ సభ్యులు

మునగపాక: స్థానిక పల్లపు వీధిలోని గోమాలమ్మ తల్లి సంఘం అధ్యక్షునిగా వెలగా శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గోమాలమ్మ గుడి ప్రాంగణంలో ఆదివారం రాత్రి నూతన కార్యవర్గం ఎంపికయింది. అధ్యక్షునిగా శ్రీనివాసరావు, కార్యదర్శిగా పెంటకోట పరశురామ్, కోశాధికారిగా పిల్లా జగదీష్, ఉపాధ్యక్షునిగా వెలగా రామకృష్ణ, డైరెక్టర్లుగా వెలగా శివరామ జోగి, వెలగా సీతారామ్, వెలగా దుర్గునాయుడు, జగదీష్ కుమార్ ఎన్నికయ్యారు. సంఘ పెద్దలు బొడ్డేడ అప్పలనాయుడు, వెలగా సురేష్‌కుమార్, పెంటకోట జోగినాయుడు, వెలగా ధర్మసూరి, వెలగా వెంకటప్పారావుల సమక్షంలో ఎన్నికలు జరిగాయి. రెండేళ్ల పాటు ఈ పాలకవర్గం పనిచేస్తుందని సంఘ అధ్యక్షుడు తెలిపారు.


తుఫాన్ షెల్టర్ తొలగిస్తాం



శిథిలావస్థకు చేరిన తుఫాన్ షెల్టర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

పాయకరావుపేట: మండలంలో వెంకటనగరం పాఠశాల ఆవరణలో శిథిలమైన తుఫాన్ షెల్టర్ భవనాన్ని తొలగింపునకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మహేశ్వరరావు తెలిపారు. తుపాను కారణంగా తీర ప్రాంతంలో ఎంపీడీవో జయప్రకాష్‌రావుతో కలిసి ఆయన సోమవారం పర్యటించారు. ఇందులో భాగంగా గ్రామంలో శిథిలమైన తుఫాన్ షెల్టర్ భవనాన్ని తొలగించాలని సర్పంచ్ వంకా రమణ కోరారు. వెంటనే వారు పరిశీలించి తొలగింపునకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యదర్శి వైవీ సత్యనారాయణ, వీఆర్వో నూకరాజు పాల్గొన్నారు.


ముంపు పొలాల పరిశీలన



నీట మునిగిన వరి పైరును పరిశీలిస్తున్న అధికారులు

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లిలో ముంపునకు గురైన వరి పొలాలను అనకాపల్లి వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు సీహెచ్.సుబ్రహ్మణ్యం సోమవారం పరిశీలించారు. రెండు రోజులుగా కురిసిన వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో వరి పైరు ముంపునకు గురికావడంతో స్థానిక వ్యవసాయాధికారి సీహెచ్.జ్యోత్స్న కుమారితో కలిసి పరిశీలించారు. ముంపునకు గురైన పొలం నుంచి నీరు పోయేలా చూడాలని సూచనలు చేశారు. అధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పూడిమడక తీరంలో మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య పర్యవేక్షకులు

అచ్యుతాపురం రూరల్: వర్షాకాలంలో ఎప్పటికప్పుడు పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలని ఆరోగ్య పర్యవేక్షకుడు లండా అప్పలకొండ ప్రజలకు సూచించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రావ్య ఆదేశాల మేరకు సోమవారం తీర ప్రాంతాలైన తంతడి, పూడిమడక గ్రామాల్లో పర్యటించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎటువంటి వ్యాధులు దరిచేరవని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు.

భయం భయంగా.. బయటకు!



పట్టణంలోని ప్రధాన రహదారిపై ఎస్‌బీఐ కూడలి వద్ద శునకాల గుంపు

- పట్టణం, గ్రామాల్లో హడలెత్తిస్తున్న వీధి కుక్కలు
- రోడ్లపై గుంపులుగా సంచారం
- మొక్కుబడిగా యానిమల్ బర్త్ కంట్రోల్ ప్రోగ్రాం
- నియంత్రణలో అధికారులు విఫలం

యలమంచిలి రూరల్: కుక్కల గుంపు కనిపిస్తే చాలు పట్టణ ప్రజలకు గుండె జారిపోతోంది. ఉన్నపళంగా మీదపడి కరవడంతో అడుగు ముందుకేయలేని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. యలమంచిలి పట్టణం, శివారు గ్రామాల్లో వీధికుక్కల దాడులు ప్రజానీకాన్ని కలవరపరుస్తున్నాయి. పదుల సంఖ్యలో గుంపులు గుంపులుగా రోడ్లపై తిరుగుతూ పిల్లలు, మహిళలు, వృద్ధులను ద్విచక్ర వాహనదారులను వెంబడించి పరుగులు పెట్టిస్తున్నాయి. రాత్రి వేళల్లో మనుషులు కనిపిస్తే చాలు దాడులు చేసి గాయపరుస్తున్నాయి. రోడ్డు పక్కన నిలబడినా..వాటి జోలికి వెళ్లకున్నా కరుస్తుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇకపోతే ఆస్పత్రుల్లో కుక్కకాటుకు ఏఆర్‌వీ ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నప్పటికీ పిచ్చికుక్క కాటుకు వాడే ఇమ్యునోగ్లోబిన్స్ కొరత ఆందోళన కలిగిస్తోంది.

గుంపులుగా సంచారం..

నియోజకవర్గ కేంద్రమైన యలమంచిలి పట్టణంలో ఎక్కడ చూసినా వీధి కుక్కల బెడద ఎక్కువైంది. గుంపులు గుపులుగా తిరుగుతూ చిన్నా పెద్దా తేడా లేకుండా ప్రజలను కరిచి గాయపరుస్తున్నాయి. రాత్రి వేళ ఇంటి నుంచి బయటకు రావాలంటేనే జనం భయపడిపోతున్నారు. శివారు గ్రామాల్లో పొలాలకు వెళ్లి వచ్చే రైతులు, ఇంటి ముందు ఒంటరిగా ఆడుకునే చిన్నారులు, వాహనాలపై వెళ్లేవారు, ఎవరు కనిపిస్తే వారిపై ఎగబడి దాడిచేస్తున్నాయి. పట్టణంలో స్టేషన్ రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్సు, దిమిలి రోడ్డు, ఎల్ఐసి జంక్షన్లు, ధర్మవరం, కొత్తపేట, తులసీనగర్, సైతారుపేట రోడ్డు, రాంనగర్, పాత ఎర్రవరం, పెదపల్లి జంక్షన్, అల్లూరి సీతారామరాజు ,ఎన్టీఆర్, ఫైర్ ఆఫీస్, టిడ్కో కాలనీలు, పలు శివారు గ్రామాల్లో ప్రధాన వీధుల్లో వీధి కుక్కల సంతతి పెరిగిపోయింది. కొన్ని వీధుల్లో ఒకేచోట డజను వరకు శునకాలు తిష్టవేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి.

తూతూమంత్రంగా నియంత్రణ..

నిజానికి మూడేళ్లకోసారి వీధి కుక్కల నియంత్రణ కోసం యానిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ) కార్యక్రమాన్ని చేపట్టాల్సిన మున్సిపల్ అధికారులు ఎక్కడా ఆ చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇటీవల 4నెలల క్రితం వీధి కుక్కలకు సంతాన నియంత్రణ కోసం శస్త్రచికిత్సలు చేసినట్టు ప్రకటించినా, ఎన్ని కుక్కలకు చేశారో తెలియజేయలేదు. రికార్డుల్లో నమోదు చేసినంత సంఖ్యలో వీధికుక్కలకు శస్త్ర చికిత్సలు చేసినట్టు లేదన్న విమర్శలున్నాయి. దీంతో వీధి కుక్కల సంతతి గణనీయంగా పెరిగిపోయింది. ఏబీసీ కార్యక్రమంలో భాగంగా ఆడ కుక్కలకు గర్భసంచి తీసివేస్తారు. మగ కుక్కలకు క్యాస్ట్రేషన్ చేస్తారు. ఈ కార్యక్రమం పూర్తిగా అటకెక్కిందనే విమర్శలు ఉన్నాయి. వీధి కుక్కల బెడద గురించి మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంపై కుక్కకాటు బాధితులతోపాటు పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల సుప్రీంకోర్టు వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించిన నేపథ్యంలో మొక్కుబడిగా కాకుండా పక్కాగా శునకాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

100 రోజుల్లో 283 మంది కేసులు

గడచిన 100 రోజుల్లో యలమంచిలి పట్టణంతో పాటు పరిసర గ్రామాలకు చెందిన 283 మందికి పైగా కుక్కల దాడిలో గాయపడ్డారు. వీరిలో ఎక్కువ మంది పురుషులు, పిల్లలు ఉన్నారు. కుక్కలు కరిస్తే రేబిస్ వ్యాధి సోకే అవకాశం ఉంది. కుక్క కాటుకు గురైతే వెంటనే యాంటీ రేబిస్ వ్యాక్సిన్(ఏఆర్‌వీ) వేయించుకోవాలి. లేకపోతే రేబిస్ వ్యాధి బారిన పడే ప్రమాదం ఉంటుంది. ఈ వ్యాధి సోకితే శరీరంలోని నరాల వ్యవస్థ మొత్తం దెబ్బతిని చివరికి ప్రాణాలు కోల్పోతారు. రేబిస్ సోకిన వారిలో కొందరు మంచినీళ్లు తాగడానికి గానీ, నీటిని చూడటానికి గానీ విపరీతంగా భయపడిపోతారు. ఈ లక్షణాన్ని వైద్య పరిభాషలో హైడ్రోఫోబియా అంటారు. రోగి నీళ్లు తాగకపోవడంతో డీహైడ్రేషన్‌కు గురై మరణం సంభవిస్తుంది.



యలమంచిలి కోర్టుల ఆవరణలో తిష్ట వేసిన వీధి కుక్కలు

నన్ను, మా అమ్మను కరిచింది



ఇంటి ముందు రోజువారీ పనిచేసుకుంటుంటే నన్ను, మా అమ్మను అకస్మాత్తుగా వీధి కుక్క వచ్చి కరిచింది. మా వీధిలో శునకాలు గుంపులుగా తిరుగుతున్నాయి. రోడ్డుపై నడిచి వెళ్లాలంటేనే భయమేస్తోంది. ఒక కుక్క దాడి చేయడానికి వస్తే మిగతా కుక్కలు కూడా వాటి వెనకే వస్తున్నాయి. రాత్రి సమయాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. వీధుల్లో ఒంటరిగా వెళ్లే పరిస్థితి లేదు. కుక్కలని నియంత్రించాలి.

షేక్ ఆషియా, గాంధీనగరం, యలమంచిలి

కుక్కకాటు వ్యాక్సిన్ అందుబాటులో..



కుక్కకాటు బాధితులు నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో ఆస్పత్రికి రావాలి. కుక్కకాటుతో వచ్చే రేబిస్ వ్యాధి ప్రాణాంతకం. వ్యాధి సోకితే ప్రపంచంలో ఎక్కడా చికిత్స లేదు. కుక్క కరిచిన వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.వైద్యుల సూచన మేరకు ఏఆర్‌వీ వ్యాక్సిన్ వేయించుకోవాలి. ఇమ్యునోగ్లోబిన్స్ ఇంజెక్షన్లు అవసరమైన వారికి

– డాక్టర్ ఆర్ నిహారిక, యలమంచిలి సీహెచ్‌సీ

పునరావాస ప్యాకేజీ పెంచాలి



ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న నక్కపల్లి మండల భూనిర్వాసితులు

నర్సీపట్నం: నక్కపల్లి మండలం వైజాగ్, చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ భూనిర్వాసితులు పునరావాస ప్యాకేజీని పెంపుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. నిర్వాసితులైన రాజయ్యపేట, బుచ్చిరాజుపేట, చందవాడ, అమలాపురం, డీఎల్.పురం గ్రామాల భూనిర్వాసితులు ఆందోళన బాటపట్టారు. ఇల్లు కోల్పోయిన కుటుంబాల్లో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఐదు సెంట్లు ఇంటి స్థలం, రూ.8,98,000 ప్యాకేజీ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఈ ప్యాకేజీ ఎంత మాత్రం తమకు ఆమోదయోగ్యం కాదన్నారు. 2013లో వచ్చిన భూ సేకరణ చట్టంలో రూ.5 లక్షలు ప్యాకేజీ ప్రకటించిందన్నారు. ఈ చట్టం వచ్చి నేటికి 12 ఏళ్లు అవుతుందన్నారు. ప్రస్తుతం ఇంటి నిర్మాణ సామగ్రి ధరలు పెరిగాయన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.25 లక్షలు ప్యాకేజీ ప్రకటించాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు. 18 ఏళ్లు నిండిన ఆడపిల్లలకు కూడా ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో వి.వి.రమణకు వినతిపత్రం అందజేశారు.

మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు



రైతుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న తహసీల్దార్ సత్యనారాయణ

అచ్యుతాపురం రూరల్: ఖాజీపాలెం, పెదపాడు గ్రామాల్లో పొలాలను తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. తీర ప్రాంతాలైన తంతడి, పూడిమడకలో ముందస్తు తుఫాన్ హెచ్చరికలు జారీ చేశారు. బుధవారం వరకూ మత్స్యకారులను వేటకు వెళ్లొద్దని సూచించారు. అక్కడున్న తుఫాన్ షెల్టర్ బిల్డింగ్‌ను పరిశీలించి శుభ్రం చేయాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. వీఆర్వో శశి పాల్గొన్నారు.

నీట మునిగిన వరి పొలాలు



వాడ్రాపల్లికి వెళ్లే దారిలో నీట మునిగిన వరిపొలం

మునగపాక: మండల వ్యాప్తంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి పైరు దెబ్బతింది. పలు చోట్ల రైతులు వరి ఉడుపులు పూర్తి చేయగా, మరికొన్ని చోట్ల ఆకుమడులు పూర్తి చేశారు. అయితే బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన కారణంగా కురుస్తున్న వర్షాలకు వరి పొలాలు దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు. మునగపాక నుంచి వాడ్రాపల్లికి వెళ్లే దారిలో పలు చోట్ల వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. ఇటీవల ఉడుపులు చేసిన పొలాలు నీట మునిగాయి. దీంతో వేలాది రూపాయల పెట్టుబడులు కోల్పోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. ఎడతెరిపి లేని వర్షాలకు రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టకుంటే తీవ్ర నష్టాలు చవిచూడాల్సి వస్తుందని వాపోతున్నారు. పలు లోతట్టు ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచిపోయింది.

తీర ప్రాంతంలో అప్రమత్తంగా ఉండాలి

అధికారుల బృందం పర్యటన



రాజయ్యపేట తుపాను కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్, ఎంపీడీవోలు

నక్కపల్లి: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో వాతావరణ శాఖ తుపాను హెచ్చరికల నేపథ్యంలో తీర ప్రాంత గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ నర్సింహమూర్తి, ఎంపీడీవో సీతారామరాజు సూచించారు. సోమవారం వారు రాజయ్యపేట, బోయపాడు, చందనాడ, మూలపర తదితర గ్రామాల్లో పర్యటించారు. తుపాను రక్షిత భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులనుద్దేశించి మాట్లాడుతూ మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లరాదన్నారు. తీరప్రాంత గ్రామాల్లో తుపాను రక్షిత భవనాల వద్ద అన్ని సదుపాయాలు కల్పించాలని పంచాయతీరాజ్, రెవెన్యూ మత్స్య శాఖల సిబ్బందిని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. సచివాలయాల్లో సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. తాగు నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. క్లోరినేషన్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. తుపాను తీవ్ర ప్రభావం చూపిస్తే బాధితులకు తిండి, వసతి సదుపాయం కల్పించేందుకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. తుపాను రక్షిత భవనాల వద్ద నిత్యావసర సరుకులు, జనరేటర్ సదుపాయాలను కల్పించాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు పాల్గొన్నారు.

సర్పంచ్‌ని పరామర్శించిన కంబాల



గంపల మార్తని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, నాయకులు

పాయకరావుపేట: మండలంలో పెదరాంభద్రపురం గ్రామ సర్పంచ్ గంపల మార్తని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త కంబాల జోగులు పరామర్శించారు. ఇటీవల ఆమె సర్జరీ చేయించుకుని, ఇంటి వద్దనే విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న జోగులు పరామర్శించి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు, జెడ్పీటీసీ లంక సూర్యనారాయణ, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా, ఉప సర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, సర్పంచ్‌లు గెడ్డమూరి నీలవేణి శ్రీనివాసరావు, పన్నీరు పాపారావు, చేపల నాగమణి తాతాజీ, ఎంపీటీసీ గారా వెంకటలక్ష్మి చక్రవర్తి, తెరపల్లి చంటి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం



కబడ్డీ ఆడుతున్న పురుషుల జట్లు

మునగపాక: మండలంలోని నాగులాపల్లిలో సోమవారం రాత్రి రాష్ట్ర స్థాయి మహిళలు, పురుషుల కబడ్డీ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ జన్మదినం సందర్భంగా మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ పోటీలను జనసేన పార్టీ ఉత్తరాంధ్ర కన్వీనర్ సుందరపు సతీష్ ప్రారంభించారు. 8 జిల్లాలకు సంబంధించి మహిళలు, పురుషుల జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. ఫ్లడ్ లైట్ల వెలుతురులో జరుగుతున్న పోటీలను తిలకించేందుకు క్రీడాభిమానులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సందర్భంగా సతీష్‌కుమార్ మాట్లాడుతూ కబడ్డీకి ఎంతో ఆదరణ ఉందన్నారు. క్రీడల ద్వారా మానసిక ప్రశాంతత దొరుకుతుందన్నారు. శరీర దారుఢ్యం పెరుగుతుందన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం అందరిపైనా ఉందన్నారు. మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ దొడ్డి శ్రీనివాసరావు మిత్ర మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కూటమి నేతలు దాడి ముసిలినాయుడు, నూకాలయ్య, ఆడారి జగన్నాథరావు, ఆడారి గణేష్, పిన్నమరాజు వాసు, మళ్ల రాజేష్, బాబ్జీ, టెక్కలి పరశురామ్, మొల్లేటి సత్యనారాయణ, కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఉరుకూటి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు, పోటీల కన్వీనర్ కేఎస్‌వీ సత్యనారాయణ, టెక్నికల్ కమిటీ సభ్యులు గణపతిరావు, కోచ్ శివ పాల్గొన్నారు.

ఆవ కాలువ గేట్లు ఎత్తివేత



తోటాడ రెగ్యులేటర్‌ను ఎత్తివేయిస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ

మునగపాక: పొలాలకు నీటి ముంపు లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ పి.సత్యనారాయణ తెలిపారు. మండలంలోని తోటాడ త్రిమూర్తుల ఆలయ సమీపంలోని అనకాపల్లి ఆవ కాలువకు నీటి ఉధృతి ఎక్కువగా ఉన్నందున పంటలకు నష్టం వాటిల్లకుండా ఉండేలా సంబంధిత గేట్లను సోమవారం సాయంత్రం ఎత్తివేయించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలతో నీటి ఉధృతి ఎక్కువగా ఉన్నందున రైతులకు నష్టం వాటిల్లకుండా ఉండేలా గేట్లు ఎత్తివేశామన్నారు. 24 గంటల తర్వాత మరలా గేట్లను మూసివేస్తామన్నారు. పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

మునగపాక: ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో ఎం.సోమరాజు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో భాగంగా అర్జీలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి స్థానిక అధికారులు పాటుపడాలన్నారు. వ్యక్తిగత సమస్యలను ఇలాంటి వేదిక దృష్టికి తీసుకురావడం ద్వారా పరిష్కారం అవుతాయన్నారు. వెలుగు ఏపీఎం బాలరాజు, మండల ఇంజనీరింగ్ అధికారి గులామ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మానస, ట్రాన్స్‌కో ఏఈ జగదీష్, అధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణుని విగ్రహం ఊరేగింపు



అడ్డురోడ్డులో శ్రీకృష్ణుని విగ్రహం ఊరేగింపు

ఎస్.రాయవరం: శ్రీకృష్ణాష్టమి వేడుకలు పురస్కరించుకుని అడ్డురోడ్డు కూడలిలో సోమవారం కృష్ణుని విగ్రహం ఊరేగింపు నిర్వహించారు. చిన్నారుల కోటాటం, మహిల భక్తి గీతాలాపనల మధ్య ఊరేగింపు జరిగింది. దీంతో కూడలిలో సందడి వాతావరణ నెలకొంది.

రామాలయంలో విగ్రహ ప్రతిష్ట...

దార్లపూడి రామాలయంలో సోమవారం తెల్లవారుజామున వరసిద్ధి వినాయక, సరస్వతీ దేవి విగ్రహాలు ప్రతిష్ట చేశారు. రెండు రోజులుగా ఇక్కడ ప్రత్యేక పూజలు, ఊరేగింపులు నిర్వహించారు.

చిత్తడిగా మారిన రహదారులు



బురదమయంగా వాడ్రాపల్లి-తిమ్మరాజుపేట రోడ్డు



అధ్వానంగా దర్శనమిస్తున్న మునగపాక ఇందిరమ్మ కాలనీ రోడ్డు

మునగపాక: కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు పలు రహదారులు చిత్తడిగా మారాయి. బురదమయంగా రహదారులు దర్శనమిస్తున్నాయి. దీంతో రాకపోకలు సాగించేవారు అవస్థలు పడుతున్నారు. మునగపాక ఇందిరమ్మ కాలనీ ప్రధాన రహదారి అధ్వానంగా దర్శనమిస్తోంది. రహదారిపై రాకపోకలు సాగించేవారు ఇబ్బందులు పడుతున్నారు. పాదచారులు అవస్థలు పడుతున్నారు. వాడ్రాపల్లి-తిమ్మరాజుపేట రోడ్డుపై వర్షపునీరు నిలిచిపోవడంతో రాకపోకలు సాగించేవారు అవస్థలు పడుతున్నారు. పక్కారోడ్డు లేకపోవడంతో ఇరు గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పక్కా రోడ్డు నిర్మించి ఇక్కట్లు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

మెయిన్‌రోడ్డులో వర్షం నీటితో ఇబ్బందులు



తహసీల్దారు తిరుమలబాబుకు వివరిస్తున్న నాయకులు

కోటవురట్ల: మండల పరిషత్ కార్యాలయం ఎదుట మెయిన్‌రోడ్డులో భారీగా వర్షం నీరు నిలిచిపోవడంతో అధికారులు, నాయకులు కదిలారు. సమస్య పరిష్కారం కోసం చర్చించారు. కొద్దిపాటి వర్షానికే ఎంపీడీవో కార్యాలయం ఎదుట మెయిన్‌రోడ్డు చెరువులా మారిపోతోంది. ఈ సమస్య చాలా కాలంగా ఉన్నా అధికారులు స్పందించలేదు. ఈ నేపథ్యంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షంతో పరిస్థితి దారుణంగా తయారైంది. వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దాంతో వైఎస్సార్ సీపీ నాయకుడు సిద్దాబత్తుల సత్యనారాయణ, సర్పంచ్ బొడ్డపాటి అనిల్‌కుమార్, ఎంపీటీసీ సభ్యుడు పుట్రేవు వెంకటసూర్యారావు కలిసి ఎంపీడీవో చంద్రశేఖర్‌కు సమస్యను వివరించారు. అక్కడి నుంచి అందరూ కలిసి తహసీల్దారు తిరుమలబాబు దృష్టికి తీసుకెళ్లారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి వంద మీటర్ల దూరంలో తుపాకుల గెడ్డలోకి నీరు పోయలా డ్రైనేజీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. జెడ్పీటీసీ నిధులు కేటాయించేందుకు కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ నాయకుడు సత్యనారాయణ తెలిపారు. జేఈ వర్మ, హౌసింగ్ జేఈ ప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్సీ రైతులకు వ్యవసాయ పరికరాలు



మాట్లాడుతున్న సంఘం సీఈవో సత్యనారాయణ

పాయకరావుపేట: తాండవ వాలి ఉద్యానవన, వ్యవసాయ రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘంలో ఎస్సీ రైతులకు వ్యవసాయ పరికరాలు పంపిణీ చేయనున్నామని సంఘ ముఖ్య కార్యనిర్వహణ అధికారి జి.వి.వి. సత్యనారాయణ తెలిపారు. మండలంలోని సత్యవరం గ్రామంలో సంఘం 3వ సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. నాబార్డ్, కృషి విజ్ఞాన కేంద్రం సహకారంతో రైతులకు ఫుడ్ ప్రాసెసింగ్ అంశాలపై శిక్షణ ఇస్తున్నామన్నారు. సంఘం వ్యాపార లావాదేవీలను పెంచడానికి కృషి చేస్తున్నామన్నారు. సమావేశంలో గ్రామీణ బ్యాంకు అధికారులు వెంకటరావు, సంఘం అధ్యక్షుడు వి.వి. సత్యనారాయణ, సర్పంచ్ నఖిలేటి రాము, ఎంపీటీసీ యగదాసు శేఖర్, సంఘం డైరెక్టర్లు, సభ్య రైతులు పాల్గొన్నారు.

కేజీబీవీలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం



కంప్యూటర్ ల్యాబ్ ప్రారంబిస్తున్న మంత్రి అనిత

నక్కపల్లి: స్థానిక కేజీబీవీలో రూ.40 లక్షలతో నిర్మించిన కంప్యూటర్ ల్యాబ్, అదనపు తరగతి గదులను హోం మంత్రి అనిత సోమవారం ప్రారంభించారు. విద్యార్థినుల సమస్యలను తెలుసుకున్నారు. ఇక్కడ వసతి, మెస్ సదుపాయాలు ఎలా ఉన్నాయని ఆరా తీశారు. ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తుందని, బాగా చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చి చదువుకుంటున్న విద్యార్థినులకు నాణ్యమైన విద్య నందించాలని ఉపాధ్యాయినులకు సూచించారు. ప్రిన్సిపాల్ సలీమా, ఉపాధ్యాయిని వెంకటలక్ష్మి, తహసీల్దార్ నర్సింహమూర్తి, ఎంపీడీవో సీతారామరాజు, డిప్యూటీ ఎంపీడీవో చలపతిరావు, ఎంఈవో కుంచం నరేష్, టీడీపీ మండల అధ్యక్షుడు గింజాల లక్ష్మణరావు, బీజేపీ నాయకుడు కోసూరు శ్రీను పాల్గొన్నారు.